సాక్షి
వికారాబాద్
శనివారం, 4, మార్చి, 2023



మార్పు రాకుంటే ఇంటికే..

అధికారులు, ఉద్యోగుల పనితీరులో మార్పు రాకపోతే ఇంటికి పంపించేస్తానని కలెక్టర్ నారాయణరెడ్డి హెచ్చరించారు. 10లో▸



స్వామివారి కల్యాణ మహోత్సవంలో ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి దంపతులు

కల్యాణ వైభోగమే..

- పరిగిలో ఘనంగా శ్రీవారి బ్రహ్మోత్సవాలు
- సతీసమేతంగా సంబరాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి

పరిగి: పట్టణంలోని శ్రీలక్ష్మీవేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా మూడో రోజైన శుక్రవారం స్వామివారి కల్యాణం నిర్వహించారు. స్థానిక ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి, మాజీ డిప్యూటీ స్పీకర్ కొప్పుల హరీశ్వర్‌రెడ్డి, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు అనిల్‌రెడ్డి సతీసమేతంగా వేడుకల్లో పాల్గొన్నారు. వందలాదిగా తరలివచ్చిన మహిళలు, భక్తులు స్వామివారి పెళ్లి సంబరాలను తిలకించి తరించారు. ఎమ్మెల్యే సౌజన్యంతో భక్తులకు అన్నదానం చేశారు. సాయంత్రం ఆలయం నుంచి పురవీధుల మీదుగా శ్రీవారి పల్లకీ ఊరేగింపు నిర్వహించారు. వేడుకల్లో మున్సిపల్ చైర్మన్ ముకుంద అశోక్‌కుమార్, జెడ్పీటీసీ హరిప్రియ, మార్కెట్ కమిటీ చైర్మన్ సురేందర్, పీఏసీఎస్ చైర్మన్ శ్యాంసుందర్‌రెడ్డి, వైస్ చైర్మన్ భాస్కర్, టీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఆంజనేయులు, సీనియర్ నాయకులు ప్రవీణ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



వేంకటేశ్వర కల్యాణ వేడుకల్లో భాగంగా స్వామివారికి మొక్కుతున్న మహిళలు

న్యూస్‌రీల్

లారీ ఓనర్స్ అసోసియేషన్ సారథులకు సన్మానం



ఎమ్మెల్సీ మహేందర్‌రెడ్డితో లారీ ఓనర్స్ అసోసియేషన్ ప్రతినిధులు

తాండూరు టౌన్: ఇటీవల నిర్వహించిన తాండూరు లారీ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఎన్నికల్లో అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా ఎన్నికైన అబ్దుల్ గని, నర్సింహ్మారెడ్డిని ఎమ్మెల్సీ మహేందర్‌రెడ్డి శాలువా, పూలమాలలతో సత్కరించారు. ఎన్నికల్లో గెలుపొందిన సందర్భంగా నూతన నాయకులు శుక్రవారం ఎమ్మెల్సీని తన నివాసంలో కలిశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ స్వప్న, బీఆర్ఎస్ నాయకులు కరణం పురుషోత్తంరావు, అబ్దుల్ రవూఫ్, వడ్డే శ్రీనివాస్, పట్లోళ్ల బాల్‌రెడ్డి, నర్సింహులు, కౌన్సిలర్లు ప్రవీణ్, రామకృష్ణ ఉన్నారు.

రైతులకు అందుబాటులో ఉండాలి

ఏఈఓలకు జిల్లా వ్యవసాయ అధికారి గోపాల్ ఆదేశం



పెద్దేముల్ మండలం గోపాల్‌పూర్‌లో పంటను పరిశీలిస్తున్న డీఏఓ గోపాల్

పెద్దేముల్: ఏఈఓలు రైతులకు అందుబాటులో ఉండాలని జిల్లా వ్యవసాయ అధికారి గోపాల్ అన్నారు. శుక్రవారం పెద్దేముల్ మండల గోపాల్‌పూర్, హన్మాపూర్ గ్రామాల్లో వ్యవసాయ సహాయ సంచాలకులు రుద్రమూర్తితో కలసి పంటలను పరిశీలించారు. రైతులకు మొక్కజొన్న పంట సాగుపై అవగాహన కల్పించారు. రైతులు వ్యవసాయ అధికారి వద్ద పంట నమోదు తప్పకుండా చేయించాలని సూచించారు. రైతుల ఫిర్యాదుపై వెంటనే చర్యలు తీ సుకుంటామన్నారు. కార్యక్రమంలో పెద్దేముల్ ఏఓ నజీరొద్దీన్,శ్రావణ్‌కుమార్ పాల్గొన్నారు.

6నుంచి పాదయాత్ర

అనంతగిరి: ఎస్సీ వర్గీకరణ సాధన కోసం బీజేపీపై ఒత్తిడి తెచ్చే ప్రక్రియలో భాగంగా ఈ నెల 6న కొడంగల్ నుంచి పాదయాత్ర చేపట్టనున్నట్లు ఎమ్మార్పీఎస్ జాతీయ ప్రధాన కార్యదర్శి కోళ్ల శివ అన్నారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఎమ్మార్పీఎస్, ఎమ్మెస్పీ ముఖ్య కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పట్టణంలో ప్రారంభమయ్యే పాదయాత్ర మన్నెగూడ, పరిగి మీదుగా హైదరాబాద్ చేరుకుంటుందని తెలిపారు. తాము అధికారంలోకి రాగానే వంద రోజుల్లో వర్గీకరణ బిల్లు పెట్టి ఆమోదింపజేస్తామని చెప్పిన కేసీఆర్ ప్రభుత్వం.. బీజేపీ కాలయాపన చేస్తోందని చెప్పడంలో అర్థం లేదన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెస్పీ జిల్లా అధ్యక్షుడు ఆనంద్, సీనియర్ నాయకులు మల్లికార్జున్, స్వామిదాస్, మల్లేశం,పుష్పలత, రమేష్, సుభాష్, శ్రీనివాస్, ఆనంద్, శ్రీశైలం, మోహన్, బాబురావు, నర్సింలు, ప్రకాశ్, కృష్ణ, జగన్, తిరుపతయ్య తదితరులు పాల్గొన్నారు.

పత్తాలేని ప్రత్యేక నిధులు

డీపీఆర్‌లు సమర్పించి నాలుగు నెలలు

- కదలని అభివృద్ధి పనులు
- ఆందోళనలో వికారాబాద్ మున్సిపల్ ప్రజలు

వికారాబాద్ అర్బన్: జిల్లా కేంద్రం అభివృద్ధి విషయంలో ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు ఇచ్చిన హామీలు నెలలు గడుస్తున్నా నెరవేరడం లేదు. దీంతో మున్సిపల్ పరిధిలో చేపట్టాల్సిన పనులన్నీ ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అనే చందంగా మారాయి. వికారాబాద్‌కు రాష్ట్ర మున్సిపల్, ఐటీ శాఖ మంత్రి కేటీఆర్ పెద్దఎత్తున నిధులు ఇవ్వబోతున్నారని అతి త్వరలోనే జిల్లా కేంద్రం రూపురేఖలు మారబోతున్నాయని నానా హడావుడి చేశారు. ఈ మేరకు డిసెంబర్ 6న మున్సిపల్ సీడీఎంఏ సత్యనారాయణ, మున్సిపల్ శాఖ మంత్రి ఓఎస్డీ మహేందర్, చేవెళ్ల ఎంపీ రంజిత్‌రెడ్డి, స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ తదితరులు పట్టణంలో పర్యటించారు. ఆయా కాలనీల్లో అవసరమైన పనులను గుర్తించారు. మరుసటి రోజే సదరు పనులపై జిల్లా అధికారులు డీపీఆర్ (డిటేయిల్డ్ ప్రాజెక్ట్ రిపోర్ట్) సమర్పించారు. రాష్ట్ర స్థాయి అధికారుల బృందం వచ్చి స్వయంగా వివరాలు సేకరించడంతో తమ సమస్యలు తీరుతాయని ప్రజలంతా భావించారు. కానీ నాలుగు నెలలు గడుస్తున్నా ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదు.

గుర్తించిన పనులివే..

కొత్తగా ఏర్పడిన జిల్లా కేంద్రం త్వరగా అభివృద్ధి చెందాలని పట్టణ ప్రజలతో పాటు, శివారు వార్డుల ప్రజలు కోరుతున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు పరిశీలించిన దాంట్లో ప్రధానంగా మన్నెగూడ నుంచి అనంతగిరి వరకు నాలుగు లైన్ల రోడ్డు, ఎన్నెపల్లి- మద్గుల్ చిట్టంపల్లి, ఎన్టీఆర్ చౌరస్తా- అనంతగిరి, బీజేఆర్ సర్కిల్- బుగ్గరామేశ్వరం, బీజేఆర్ సర్కిల్- కొత్తగడి వరకు రోడ్డు డివైడర్ ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. రైల్వే బ్రిడ్జి మరమ్మతులతో పాటు క్రీడా మైదానం ఏర్పాటు, జిల్లా కేంద్రంలోని ఐదు ప్రధాన చౌరస్తాల అభివృద్ధి వంటి అధికారులు పనులను గుర్తించారు. హైదరాబాద్ ప్రధాన రోడ్డు పక్కనే ఉన్న శివారెడ్డిపేట్ చెరువును మినీ ట్యాంక్ బండ్‌గా తీర్చిదిద్దడంపై సమాలోచనలు చేశారు. వికారాబాద్ టౌన్‌పై మంత్రి కేటీఆర్ ప్రత్యేక దృష్టి పెట్టారని, ఒకటి రెండు రోజుల్లో డీపీఆర్ తయారు చేసి సమర్పిస్తే రూ.150 కోట్ల నుంచి రూ.200 కోట్లు మంజూరవుతాయని తెలిపారు. ఉన్నతాధికారులు ఆదేశం మేరకు పట్టణ అభివృద్ధిపై డీపీఆర్ సమర్పించినా అమలుపై ఎలాంటి ప్రకటన వెలువడకపోవడంపై మున్సిపల్ ప్రజలు అసహనం వ్యక్తంచేస్తున్నారు. ఇందుకు సంబంధించిన ఫైల్ ఎక్కడుందో తమకు సమాచారం లేదని స్థానిక అధికారులు చెబుతున్నారు.



శివారెడ్డిపేట్ చెరువును పరిశీలిస్తున్న అధికారులు, ఎంపీ, ఎమ్మెల్యే (ఫైల్)

మోదుగ పూసే..

హోలీ పండుగ సమీపిస్తుందంటే చాలు అడవితల్లి అందంగా ముస్తాబవుతుంది. ఎక్కడ చూసినా ఎర్రటి పూలతో విరబూసిన మోదుగ వృక్షాలు కనువిందు చేస్తుంటాయి. పండుగ రోజున చల్లుకునేందుకు సహజ సిద్ధమైన రంగుల తయారీ కోసం గ్రామీణ ప్రజలు ఈ పువ్వును వాడుతుంటారు. మోదుగ పూలను నీటిలో ఉడికించి ప్రకృతి సిద్ధమైన రంగులను తయారు చేస్తారు. కాశింపూర్ సమీపంలోని జుంటివాగు వద్ద విరబూసిన మోదుగ చెట్టును 'సాక్షి' కెమెరా క్లిక్‌మనిపించింది.

– బషీరాబాద్



తప్పు చేసి తల దించుకోవద్దు



సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్ నారాయణరెడ్డి

- పారదర్శకంగా విధులు నిర్వర్తించాలి
- కలెక్టర్ నారాయణరెడ్డి

వికారాబాద్ అర్బన్: విధి నిర్వహణలో తప్పులు చేసి తల దించుకునే పరిస్థితి తెచ్చుకోవద్దని కలెక్టర్ నారాయణరెడ్డి అధికారులకు సూచించారు. పట్టణ ప్రగతి, పారిశుద్ధ్యం, విద్యుత్, తాగునీరు, అటెండెన్స్ యాప్‌లపై శుక్రవారం అదనపు కలెక్టర్ రాహుల్ శర్మతో కలిసి సమీక్ష నిర్వహించారు. జిల్లాలోని నాలుగు మున్సిపాల్టీల అధికారులు ఇందులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రజల అవసరాలను గుర్తించి ప్రాధాన్యత క్రమంలో పనులు చేపట్టాలన్నారు. సిబ్బందిలో స్పష్టమైన మార్పు రావాలని తెలిపారు. శానిటేషన్ ఇన్‌స్పెక్టర్లు క్షేత్ర స్థాయిలో తిరుగుతూ పనులు చేయించాలని సూచించారు. నిర్లక్ష్యం చేసేవారిని తొలగిస్తామనే స్పష్టమైన సంకేతాలు ఇవ్వాలని స్పష్టం చేశారు. పట్టణ ప్రగతిలో చేపట్టిన పనులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సూచించారు. ఈ నెల 20లోపు మున్సిపాలిటీల్లో తాగునీరు,విద్యుత్, పారిశుద్ధ్య సమస్యలు లేకుండా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ఆతర్వాత తాను పట్టణాల్లో పర్యటిస్తానని ఏదైనా తేడా కనిపిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రతీ సోమవారం ఉదయం 10:30 నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు ప్రజావాణి కార్యక్రమంలో పాల్గొని ఫిర్యాదులు స్వీకరించాలని ఆదేశించారు. మే 31లోపు సమీకృత వెజ్ అండ్ నాన్ వెజ్ మార్కెట్ యార్డుల పనులు పూర్తి చేయాలన్నారు.

చదువు, సంస్కారమే ఆభరణాలు



దోమ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న ప్రిన్సిపాల్ మంజుల

- ప్రిన్సిపాల్ మంజుల

దోమ: విద్యార్థి దశలో చదువుతో పాటు సంస్కారం ఎంతో అవసరమని, ఇవే ఆభరణాలుగా నిలుస్తాయని దోమ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ మంజుల అన్నారు. ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు శుక్రవారం నిర్వహించిన వీడ్కోలు సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. ప్రతిఒక్కరూ ఉన్నత చదువులు అభ్యసించాలని సూచించారు. విద్యార్థి దశలో కష్టపడిన వారు భవిష్యత్తులో ఉత్తమ స్థాయిలో నిలుస్తారని తెలిపారు. వ్యసనాలు, దురలవాట్లకు దూరంగా ఉంటూ తల్లిదండ్రుల ఆశయాలను నిలబెట్టాలని కోరారు. క్రమశిక్షణతో కూడిన విద్యను అలవర్చుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. అనంతరం గత నెల 14న నిర్వహించిన టాలెంట్ టెస్ట్‌లో విజేతలుగా నిలిచినవారికి బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు శ్రీధర్, ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



అనంతగిరి: ఎన్టీఆర్ చౌరస్తాలో నిర్వహించిన ధర్నాలో సిలిండర్ ఎత్తిన ఎమ్మెల్యే ఆనంద్



తాండూరు: బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆందోళనలో ఎమ్మెల్సీ మహేందర్‌రెడ్డి



కొడంగల్: మాట్లాడుతున్న ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి

'గ్యాస్' మంటలు

గ్యాస్ ధరల పెంపును నిరసిస్తూ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా శుక్రవారం ఆందోళన కార్యక్రమాలు చేపట్టారు. వికారాబాద్, తాండూరు, పరిగి, కొడంగల్ పట్టణాల్లో రోడ్లపై కట్టెల పొయ్యిలు ఏర్పాటు చేసి వంట చేశారు. కట్టెల మోపులు తలపై పెట్టుకుని వచ్చిన మహిళా కార్యకర్తలు, నాయకులు.. మోదీ సర్కార్ తీరుపై మండిపడ్డారు. గ్యాస్ ధరలు పెంచి పేదల నడ్డి విరిచిన బీజేపీ సర్కారును గద్దె దింపాలని నినాదాలు చేశారు.



పరిగి: ప్రధాన చౌరస్తాలో బీఆర్ఎస్ నేతల ఆందోళన



పెద్దేముల్: మంబాపూర్‌లో నిర్వహించిన నిరసన కార్యక్రమంలో ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి

క్లుప్తంగా

అంగన్‌వాడీలకు న్యాయం చేయాలి

వికారాబాద్ అర్బన్: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అంగన్‌వాడీ టీచర్ల సమస్యలను సత్వరమే పరిష్కరించాలని బీఆర్ఎస్ కార్మిక విభాగం జిల్లా అధ్యక్షుడు బి. కృష్ణయ్య శుక్రవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. అంగన్‌వాడీ టీచర్ల శ్రమను గుర్తించిన సీఎం కేసీఆర్ దేశంలో ఎక్కడా లేని విధంగా వారికి వేతనాలు పెంచారని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం మాత్రం వారి జీతాలు పెంచకుండా పనిభారం పెంచుతోందని మండిపడ్డారు. అంగన్‌వాడీలకు ప్రభుత్వ ఉద్యోగుల తరహాలో సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు.

ఎక్స్ పారామిలటరీ జిల్లా కమిటీ ఎన్నిక


లింగయ్యముదిరాజ్

పరిగి: ఎక్స్ పారామిలటరీ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడిగా లింగయ్యముదిరాజ్ ఎన్నికయ్యారు. అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు సైదాగౌడ్, ప్రధాన కార్యదర్శి దేవేందర్.. జిల్లా నూతన కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా లింగయ్యముదిరాజ్, ఉపాధ్యక్షుడిగా శ్రీకృష్ణయ్య, గురునాథ్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా శ్రీనివాస్‌రెడ్డి, కోశాధికారిగా ప్రభుదాస్‌ను ఎన్నుకున్నారు. శుక్రవారం నూతన కమిటీ సభ్యులకు నియమకపత్రాలు అందజేశారు. రిటైర్డ్ పారామిటరీ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని, వన్ ర్యాంకు వన్ పెన్షన్, పాత పెన్షన్ పథకాన్ని పునరుద్ధరించడం వంటి పలు డిమాండ్లపై పోరాటం చేస్తామని జిల్లా అధ్యక్షుడు లిగారెడ్డి తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

మోమిన్‌పేట: భార్య చేతిలో గొడ్డలి పోటుకు గురై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న భర్త శుక్రవారం సాయంత్రం మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు.. మండల పరిధిలోని ఏన్కతల గ్రామానికి చెందిన ఎన్నేపల్లి చంద్రయ్య(44), క్రుపమ్మ దంపతులు. రోజు కూలీ చేసుకొని జీవితం గడిపేవారు. మద్యానికి బానిసైన చంద్రయ్య నిత్యం భార్య క్రుపమ్మను శారీరకంగా, మానసికంగా హింసించేవాడు. ఈ క్రమంలో గురువారం ఉదయం మద్యం మత్తులో భార్యను హింసించసాగాడు.. ఓపిక నశించిన క్రుపమ్మ గొడ్డలితో భర్త చంద్రయ్య తలపై నరికింది. తీవ్ర రక్తగాయాలు కావడంతో చంద్రయ్యను చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శుక్రవారం సాయంత్రం చంద్రయ్య మృతి చెందాడు. మృతుడి అన్న సాయిలు ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ విజయ్ ప్రకాష్ తెలిపారు.

అధికార పార్టీ ఆందోళనలు సిగ్గుచేటు


శంకర్

షాద్‌నగర్‌రూరల్: కేంద్ర ప్రభుత్వం పెంచిన సిలిండర్ ధరల పట్ల రాష్ట్ర ప్రభుత్వం ఆందోళనలు చేపట్టడం విడ్డూరంగా ఉందని పీసీసీ కార్యదర్శి వీర్లపల్లి శంకర్ విమర్శించారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. పెరిగిన గ్యాస్ ధరలను తగ్గించే విధంగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలే తప్ప ధర్నాలకు పిలుపునివ్వడం సిగ్గు చేటన్నారు. కేంద్రం విధించిన భారాన్ని తగ్గించి ప్రజలను ఆదుకునేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. కేంద్రం వైఖరిపై అధికార పార్టీ నాయకులు, కార్యకర్తలు సిలిండర్లను నెత్తిన పెట్టుకొని ఆందోళనలు చేస్తుంటే.. రాష్ట్ర ప్రభుత్వం చేతకాని తనానికి నిదర్శనమని విమర్శించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దొందూదొందే అన్న చందంగా వ్యవహరిస్తున్నాయని మండిపడ్డారు. బీజేపీ, బీఆర్ఎస్ ప్రభుత్వాలు ఢిల్లీలో దోస్తీ, గల్లీలో కుస్తీ అన్న చందంగా వ్యవహరిస్తున్నాయని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వానికి ఏ మాత్రం చిత్తశుద్ధి ఉన్నా కేంద్రం పెంచిన గ్యాస్ ధరలను భరించి ప్రజలను ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

మార్పు రాకుంటే ఇంటికే..

- పంచాయతీ కార్యదర్శి, ఏపీఓకు కలెక్టర్ హెచ్చరిక
- రొంపల్లిలో పల్లె ప్రకృతి వనం నిర్వహణపై ఆగ్రహం
- అక్కడికక్కడే ఫీల్డ్ అసిస్టెంట్‌పై సస్పెన్షన్ వేటు


కంటి వెలుగు శిబిరంలో కలెక్టర్ నారాయణరెడ్డి


విద్యార్థి యూనిఫాంను పరిశీలిస్తున్న కలెక్టర్

బంట్వారం: అధికారులు, ఉద్యోగుల పనితీరులో మార్పు రాకపోతే ఇంటికి పంపించేస్తానని కలెక్టర్ నారాయణరెడ్డి హెచ్చరించారు. బంట్వారం మండలంలోని రొంపల్లి గ్రామంలో శుక్రవారం ఆయన విస్తృతంగా పర్యటించారు. పల్లె ప్రకృతి వనాన్ని సందర్శించి అసంతృప్తి వ్యక్తంచేశారు. పంచాయతీ కార్యదర్శి, ఏపీఓను తీవ్రంగా మందలించడంతో పాటు ఫీల్డ్ అసిస్టెంట్ శంకరయ్యను అక్కడికక్కడే సస్పెండ్ చేశారు. పార్క్ అంటే పార్క్‌లాగానే ఉండాలని, వెంటనే క్లీన్ చేసి తనకు ఫొటోలు పంపాలని ఆదేశించారు. వైకుంఠధామం, కంపోస్ట్ షెడ్డును పరిశీలించారు. అంతకు ముందు కంటి వెలుగు శిబిరాన్ని తనిఖీ చేశారు. లక్ష్యం పూర్తిచేయాలనే ఉద్దేశంతో కాకుండా, మెరుగైన చికిత్సలు అందజేయాలని క్యాంప్ ఇన్‌చార్జ్ వైద్యుడు అక్షయ్‌కు సూచించారు. కంటి పరీక్షలు చేయించుకునేందుకు వచ్చిన వృద్ధులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు.

బాగా చదువుకోవాలి

రొంపల్లి ప్రభుత్వ పాఠశాలను సందర్శించిన కలెక్టర్ నారాయణరెడ్డి విద్యార్థులతో ముచ్చటించారు. ఎంతో ఆప్యాయంగా వారి కుటుంబ వివరాలు అడిగి తెలుసుకున్నారు. బాగా చదువుకుని ప్రభుత్వ ఉద్యోగం చేయాలన్నారు. స్కూల్ ఆవరణను లెవల్ చేయించి మొక్కలు నాటాలని హెచ్‌ఎం సతీష్‌కు సూచించారు. విద్య, వైద్యం బాగుంటేనే సమాజం అభివృద్ధి పథంలో పయనిస్తుందని తెలిపారు. పాఠశాలలో తొంభై మంది విద్యార్థులు ఉండటాన్ని పరిశీలించి సంతృప్తి వ్యక్తంచేశారు. అన్ని స్కూళ్లలో రుచికరమైన మధ్యాహ్న భోజనం అందేలా చూడాలని ఎంఈఓ చంద్రప్పను ఆదేశించారు. వారంలో రెండు రోజులు గుడ్డు వడ్డించాలన్నారు.

భూ సమస్యలు పరిష్కరిస్తాం

తమ భూములకు సంబంధించిన సమస్యలు ఏళ్ల గడుస్తున్నా పరిష్కారం కావడం లేదని పలువురు స్థానికులు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన ఆయన అక్కడే ఉన్న తహసీల్దార్ శ్రీనివాస్ రెడ్డిని పిలిచి మాట్లాడారు. గ్రామంలో రెవెన్యూ సదస్సు పెట్టి సమస్యలు తీర్చాలని ఆదేశించారు. ఈజీఎస్ నిధులతో పొలాలకు రోడ్డు వేస్తామని, సర్వే చేయించి నక్ష ప్రకారం బాట చూపిస్తామని తెలిపారు. ఇటీవల నిర్మించిన సీసీ రోడ్లను పరిశీలించారు. స్థానిక ఎంపీటీసీ శ్రీకాంత్‌రెడ్డి, గ్రామస్తులు, ప్రజాప్రతినిధులు కలెక్టర్‌ను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ప్రభాకర్, జెడ్పీటీసీ సంతోష, రొంపల్లి ఎంపీటీసీ శ్రీకాంత్‌రెడ్డి, ఎంపీడీఓ బాలయ్య, తహసీల్దార్ శ్రీనివాస్‌రెడ్డి, డీఎంఓ సాయిబాబా, మెడికల్ ఆఫీసర్ మానస, పీఆర్ డీఈ జితేందర్‌రెడ్డి, ఏఈలు సురేష్‌రెడ్డి, వేణుమాధవ్, శ్రావణ్, ఏఓ సంధ్య, ఎంఈఓ చంద్రప్ప, బంట్వారం సర్పంచ్ లావణ్య తదితరులు పాల్గొన్నారు.

సమయపాలన పాటించాలి

- కలెక్టర్ నారాయణరెడ్డి

వికారాబాద్ అర్బన్: జిల్లా అధికారి స్థాయి నుంచి అటెండర్ వరకు ప్రతి ఒక్క ఉద్యోగి సమయపాలన పాటించి మంచి సేవలు అందించాలని కలెక్టర్ నారాయణరెడ్డి సూచించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో ఉదయం 10:20 గంటలకు అదనపు కలెక్టర్ రాహుల్ శర్మతో కలిసి యాక్సెస్ కార్డు ద్వారా బయోమెట్రిక్ సిస్టంను ప్రారంభించారు. ఈ మాసం జీతం అటెండెన్స్ యాప్ ఆధారంగా చెల్లిస్తామని కలెక్టర్ తెలిపారు.

ఉద్యోగ భద్రత కల్పించండి

కలెక్టరేట్ ఎదుట అంగన్‌వాడీల నిరసన


నిరసన కార్యక్రమంలో అంగన్‌వాడీలు

అనంతగిరి: సమస్యలు పరిష్కరించాలని కోరుతూ కలెక్టరేట్ ఎదుట అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ యూనియన్ (సీఐటీయూ అనుబంధం) చేపట్టిన 24 గంటల నిరసన కార్యక్రమం శుక్రవారం ముగిసింది. ఈ సందర్భంగా యూనియన్ రాష్ట్ర కార్యదర్శి జయలక్ష్మి మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అంగన్‌వాడీలకు పెన్షన్ సౌకర్యం కల్పించాలన్నారు. అంగన్‌వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలన్నారు. పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలన్నారు. రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ అందజేయాలన్నారు. కలెక్టరేట్ ప్రధాన గేట్‌కు వినతిపత్రం అంటించారు. జిల్లా అధ్యక్షుడు నర్సమ్మ, కార్యదర్శి భారతి, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు మహిపాల్, నాయకులు.. రామకృష్ణ, బుస్స చంద్రయ్య, శ్రీనివాస్, బుగ్గప్ప, లక్ష్మి, భాగ్య, ప్రమీల, వనజ, కళావతి, లక్ష్మి, కాంతమ్మ, సుజాత, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

కల్యాణం.. కమనీయం


స్వామివారికి కల్యాణం జరిపిస్తున్న వేద పండితులు

మోమిన్‌పేట: వెల్‌చాల్ లక్ష్మీ నరసింహస్వామి కల్యాణం శుక్రవారం కన్నుల పండువగా జరిగింది. నరేష్ స్వామి ఆధ్వర్యంలో వేద మంత్రాలు పటిస్తూ లక్ష్మీ సమేతంగా స్వామి వారిని కల్యాణ మండపానికి తీసుకువచ్చారు. ఉత్సవ మూర్తులకు మధ్యాహ్నం కల్యాణం జరిపించారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై వేడుకను తిలకించారు. కార్యక్రమంలో సర్పంచు లక్ష్మమ్మ, ఆలయ కమిటీ చైర్మన్ ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

నేత్ర పర్వంగా నరసింహస్వామి కల్యాణం

పాల్గొన్న ఎమ్మెల్యే డాక్టర్ ఆనంద్


స్వామివారికి పూలు సమర్పిస్తున్న ఎమ్మెల్యే ఆనంద్ తదితరులు

మోమిన్‌పేట: మండలంలోని వెల్‌చాల్ పులిలొంకలో కొలువుదీరిన లక్ష్మీనరసింహస్వామి కల్యాణ వేడుక శుక్రవారం నేత్రపర్వంగా సాగింది. ఈ వేడుకలో ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మికతను అలవర్చుకోవాలని సూచించారు.

కార్యకర్తలకు అండగా ఉంటాం

బీఆర్ఎస్ కార్యకర్తలకు అండగా ఉంటామని ఎమ్మెల్యే ఆనంద్ పేర్కొన్నారు. మండలంలోని రాళ్ల గుడుపల్లిలో పార్టీ కార్యకర్త మొల్లనోల్ల రత్నయ్య ఇటీవల మృతి చెందడంతో పార్టీ బీమా కింద రూ. 2లక్షల చెక్‌ను ఆయన కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ ఎల్లయ్య, నాయకులు విఠల్, మధుసూదన్‌రెడ్డి, ఇబ్రహీం, ప్రతాప్‌రెడ్డి, ఏఎంసీ చైర్మన్ శ్రీకాంత్‌గౌడు, పీఏసీఎస్ చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

అధికారమే లక్ష్యంగా పనిచేయాలి

- కాంగ్రెస్ నేత రమేష్ మహరాజ్ పిలుపు
- మూడో రోజు హాత్‌సే హాత్ జోడో యాత్ర


తాండూరులో హాత్‌సే హాత్ జోడో కార్యక్రమంలో రమేష్ మహరాజ్, నాయకులు

తాండూరు: కాంగ్రెస్‌ను అధికారంలోకి తీసుకురావడమే లక్ష్యంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు పని చేయాలని ఏఐసీసీ సభ్యుడు రమేశ్ మహరాజ్ అన్నారు. శుక్రవారం తాండూరు మున్సిపల్ పరిధిలోని 5, 6వ వార్డులలో హాత్‌సే హాత్ జోడో కార్యక్రమంలో భాగంగా గడపగడపకు రమేశ్ మహరాజ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లి ప్రజలతో మాట్లాడారు. అనంతరం మహరాజ్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే పేదలకు అన్నివిధాల మేలు చేకూరిందన్నారు. బీజేపీ, బీఆర్ఎస్ ప్రభుత్వాలు ప్రజావ్యతిరేక విధానాలకు పాల్పడుతున్నాయని పేర్కొన్నారు. ప్రజలపై పెనుభారం మోపుతున్నాయని మండిపడ్డారు. నిత్యావసర సరుకుల ధరలు ఆకాశాన్ని తాకడంతో ప్రజలు ఇబ్బందులు పడుతుంటే.. గ్యాస్ సిలిండర్ ధరలను పెంచి భారం మోపడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. నాడు గ్యాస్ సిలిండర్ ధర పెరిగిందంటూ గగ్గోలు పెట్టిన బీజేపీ నాయకులు అధికారంలోకి వచ్చాక ప్రజలపై అడ్డగోలుగా గ్యాస్ సిలిండర్ ధరను పెంచారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్రం వస్తే ప్రజల బతుకులు మారుతాయని కాంగ్రెస్ అధినేత్రి సోనియాగాంధీ రాష్ట్రం ఇచ్చారని, అయితే.. దొరల పాలనలో ప్రజలకు ఎలాంటి న్యాయం జరగడం లేదన్నారు. ఎనిమిదేళ్లలో బీఆర్ఎస్ పాలనలో పేదలకు ఒరిగిందేమి లేదని విమర్శించారు. ఈ కార్యక్రమంలో పీసీసీ ప్రధాన కార్యదర్శి ధారాసింగ్, బషీరాబాద్ మాజీ జెడ్పీటీసీ రాకేష్ మహరాజ్, పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ప్రభాకర్‌గౌడ్, కౌన్సిలర్లు శ్రీనివాస్‌రెడ్డి, మమత, నియోజకవర్గం యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కావలి సంతోష్, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ అలీం, మాజీ కౌన్సిలర్‌లు మల్లికార్జున్, బస్వరాజ్ తదితరులు పాల్గొన్నారు.

కిడ్నాప్, హత్యాయత్నం డ్రామా

- అప్పు ఎగ్గొట్టేందుకు యత్నం
- బెడిసికొట్టిన వ్యూహం.. నిందితుడిపై కేసు


ఇస్లావత్ రమేశ్

మహేశ్వరం: తీసుకున్న అప్పును ఎగ్గొట్టేందుకు ఓ వ్యక్తి వ్యూహం బెడిసికొట్టింది. కిడ్నాప్, హత్యాయత్నం డ్రామా ఆడిన అతనిపై బాలాపూర్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఇన్‌స్పెక్టర్ బి.భాస్కర్ కథనం ప్రకారం.. ఉప్పుగూడ సాయిబాబానగర్‌కు చెందిన ఇస్లావత్ రమేశ్ స్థానికంగా ఉంటున్న పెద్దయ్య అనే వ్యక్తి వద్ద మూడేళ్ల క్రితం రూ. లక్ష అప్పుగా తీసుకున్నాడు. కొంత కాలం తర్వాత డబ్బు తిరిగి ఇవ్వాలని పెద్దయ్య ఒత్తిడి తీసుకురావడంతో రమేశ్ కక్ష పెంచుకున్నాడు. ఎలాగైనా పెద్దయ్యను కేసులో ఇరికించి అప్పు నుంచి తప్పించుకోవాలని భావించాడు. ఇందులో భాగంగా ఫిబ్రవరి 28న ఆటోలో బాలాపూర్ దేవతల గుట్ట కమాన్ వద్దకు చేరుకున్నాడు. పక్కనే ఉన్న పొదల్లోకి వెళ్లి కాళ్లుచేతులు వైర్‌తో కట్టుకొని నోట్లో వస్త్రాన్ని పెట్టుకొని అరవడం ప్రారంభించాడు. అతని అరుపులు విన్న స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. వారు ఘటనాస్థలానికి చేరుకొని కట్లు విప్పారు. ఏం జరిగిందన్న విషయమై ఆరా తీశారు. పెద్దయ్య, అతని కుమారుడు సురేశ్ కిడ్నాప్ చేసి ఇక్కడికి తీసుకొచ్చారని.. తనను చంపేందుకు యత్నించారని ఫిర్యాదు చేశాడు. పెద్దయ్య కుమారుడి ఫోన్ నంబర్ లొకేషన్ పరిశీలించగా గుంటూరులో ఉన్నట్లుగా, అలాగే.. ఆర్‌సీఐ రోడ్డులో సీసీ కెమెరాలను పరిశీలించగా అతడు ఆటోలో దిగి నడుచుకుంటూ వెళ్లడం కనిపించింది. దీంతో కిడ్నాప్, హత్యాయత్నం రమేశ్ ఆడిన డ్రామాగానే పోలీసులు నిర్ధారణకు వచ్చారు. అతనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

వీధికుక్కల నియంత్రణకు చర్యలు

మున్సిపల్ చైర్‌పర్సన్ అనురాధ

తుర్కయంజాల్: వీధి కుక్కల నియంత్రణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటామని మున్సిపల్ చైర్ పర్సన్ మల్‌రెడ్డి అనురాధ తెలిపారు. శుక్రవారం పురపాలక సంఘం పరిధి రాగన్నగూడలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడుతూ.. వీధి కుక్కల పట్ల విద్యార్థులు జాగ్రత్తగా ఉండాలని అన్నారు. కుక్కల నియంత్రణకు బ్లూక్రాస్ సొసైటీతో ఎంఓయూ జరిగిందని.. ఇప్పటికే 660 కుక్కలకు యాంటీ రేబిస్ వ్యాక్సిన్, స్టెరిలైజేషన్ చేసినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సాబేర్ అలీ, కౌన్సిలర్లు మంగమ్మ, అనురాధ, కీర్తన తదితరులు పాల్గొన్నారు.

ఇసుక డంప్ సీజ్

తలకొండపల్లి: అక్రమంగా నిల్వ చేసిన ఇసుక డంపును శుక్రవారం రెవెన్యూ అధికారులు సీజ్ చేశారు. మండల పరిధిలోని చుక్కాపూర్‌లో ఇసుక అక్రమ రవాణా చేస్తున్నారని పక్కా సమాచారం మేరకు ఆర్‌ఐ మంజుల ఆధ్వర్యంలో రెవెన్యూ సిబ్బంది నిఘా పెట్టారు. గ్రామ శివారు ప్రాంతంలోని ఓ వ్యవసాయ పొలంలో ఇసుక డంపును గుర్తించారు. సుమారుగా రెండు లారీల వరకు ఉంటుందని, గుర్తించిన ఇసుక డంపును సీజ్ చేసినట్లు తహసీల్దార్ కృష్ణ తెలిపారు. బహిరంగ వేలం పాటల ద్వారా విక్రయించి, వచ్చిన రుసుము డబ్బులను ప్రభుత్వానికి జమ చేస్తామని తహసీల్దార్ చెప్పారు.

వైభవంగా కోటచింతల బసవేశ్వరస్వామి వేడుకలు


నందీశ్వరుడికి పూజలు చేస్తున్న భక్తులు

కుల్కచర్ల: చౌడాపూర్ మండలం మరికల్– కిష్టంపల్లి గ్రామాల మధ్య వెలిసిన శ్రీకోటచింతల బసవేశ్వరస్వామి ఆలయ వేడుకలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా శుక్రవారం నందీశ్వరుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో మరికల్ సర్పంచ్ పాండురంగయ్య, నాయకులు శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

రేపు ప్రవేశ పరీక్ష

గురుకుల బాలికల పాఠశాల, కళాశాల ప్రిన్సిపాల్ రమాదేవి


ప్రిన్సిపాల్ రమాదేవి

మొయినాబాద్‌రూరల్: తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ (సీవోఈ) 2023–24 సంవత్సరానికి గాను ఇంటర్ అడ్మిషన్‌కు నిర్వహించే ప్రవేశ పరీక్ష ఈ నెల 5న నిర్వహించనున్నట్లు ప్రిన్సిపల్ రమాదేవి తెలిపారు. ఆదివారం ఉదయం 10 గంటల నుంచి ఒంటి గంట వరకు మొయినాబాద్ మండల పరిధిలోని తోల్‌కట్ట గ్రామ సమీపంలో ఉన్న ఎస్‌వీ ఇంజనీరింగ్ కళాశాలలో పరీక్ష నిర్వహిస్తామని తెలిపారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవాలని, ఒక రోజు ముందు పరీక్ష కేంద్రాన్ని చూసుకోవాలని సూచించారు. సీవోఈ కళాశాలలో అడ్మిషన్ పొందిన వారికి అకడమిక్ బోధనతో పాటు ఐఐటీ, నీట్, పరీక్షలకు సంబంధించి ప్రత్యేక శిక్షణ ఇస్తామని, అభ్యర్థులు ఇంగ్లిష్ మీడియంలో చదవాల్సి ఉంటుందన్నారు. విద్యార్థుల ప్రతిభ ఆధారంగా సీట్ల కేటాయింపు జరుగుతుందని వివరించారు. పరీక్షకు హాజరయ్యే విద్యార్థులు తప్పనిసరిగా ఆధార్‌కార్డు, వాటర్ బాటిల్, ఎగ్జామ్ ప్యాడ్, మాస్క్ తప్పనిసరిగా ధరించాలని సూచించారు. హాల్‌టికెట్‌లో ఏవైనా తప్పులుంటే విద్యార్థులు వారికి సంబంధించిన పాఠశాల నుంచి బోనఫైడ్ తెచ్చుకోవాలని పరీక్ష కేంద్రానికి ఉదయం 9 గంటలకే చేరుకోవాలని కోరారు.

అంగన్‌వాడీలకు ఉద్యోగ భద్రత కల్పించాలి


చలో కలెక్టరేట్‌కు తరలుతున్న అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు

సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాజు

షాద్‌నగర్‌రూరల్: ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరవేయడంలో కీలక పాత్ర పోషిస్తున్న అంగన్‌వాడీలకు ఉద్యోగ భద్రత కల్పించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాజు డిమాండ్ చేశారు. అంగన్‌వాడీలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ చేపట్టిన సమ్మెలో భాగంగా శుక్రవారం సీఐటీయూ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు చలో కలెక్టరేట్‌కు తరలివెళ్లారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఐసీడీఎస్‌లో 40 ఏళ్లుగా పనిచేస్తున్న అంగన్‌వాడీలకు ఉద్యోగ భద్రత కల్పించడంలో ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. అంగన్‌వాడీ టీచర్లు, సిబ్బంది తమ సమస్యలు పరిష్కరించాలని అనేక దఫాలుగా ప్రభుత్వంపై పోరాటాలను చేస్తూనే ఉన్నారన్నారు. గతంలో అంగన్‌వాడీలకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా సీఎం కేసీఆర్ నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని విమర్శించారు. ఇతర రాష్ట్రాలలో అంగన్‌వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించారని, మన రాష్ట్రంలో కూడా అమలు చేయాలని కోరారు. అంగన్‌వాడీలకు ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యాన్ని కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు బీస సాయిబాబ, నాయకుడు రాజశేఖర్, అంగన్‌వాడీ యూనియన్ నాయకులు జయమ్మ, సంగీత, ఊర్మిళ, భారతి, అనిత, శారదమ్మ, రోజా, రంగమ్మ, సక్కుబాయి, కరుణ, పద్మ, అనూష, చంద్రకళ, నిర్మల, జంగమ్మ, కవిత, గీత, స్వాతి, బాలమణి, ఇందిర, శాలిని, సుజాత, అరుంధ, శ్రీదేవి, రేణుక, రాధాదేవి, గిరిజ, ప్రమీల, సుజాత, సురేఖ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు దుర్మరణం

- ఒకరి పరిస్థితి విషమం
- నగరానికి తరలింపు
- మానవత్వం చాటుకున్న ఎమ్మెల్యే కాలె యాదయ్య
- క్షతగాత్రులను దగ్గరుండి ఆస్పత్రికి తరలింపు
- బాధిత కుటుంబాలకు పరామర్శ


లక్ష్మారెడ్డి



నాగేష్


మృతదేహాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కాలె యాదయ్య

నవాబుపేట: ఎదురెదురుగా వచ్చిన రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొనడంతో ఇద్దరు వ్యక్తులు మృతి చెందగా ఒకరు తీవ్రంగా గాయపడ్డారు. ఈ సంఘటన మండలంలోని ఎల్లకొండ గేటు వద్ద శుక్రవారం చోటుచేసుకుంది. పోలీసులు, ప్రత్యక్ష సాక్షులు కథనం మేరకు.. ఎల్లకొండకు చెందిన రైతు కే నాగేష్(30) శుక్రవారం గ్రామానికి చెందిన విశ్రాంత హెచ్‌ఎం లక్ష్మారెడ్డి(75)ని తన బైక్‌పై మైతాప్‌ఖాన్‌గూడకు బయలుదేరాడు. ఎల్లకొండ గేటు వద్దకు రాగానే శంకర్‌పల్లి మండలం పర్వేద గ్రామానికి చెందిన కే.శివరాజు బైక్‌పై అతివేగంతో వచ్చి నాగేష్ బైకును ఢీ కొట్టాడు. ఈ ప్రమాదంలో లక్ష్మారెడ్డి అక్కడికక్కడే మృతి చెందాడు. నాగేష్, శివరాజ్‌కు తీవ్రగాయాలయ్యాయి. ప్రమాదం జరిగిన సమయంలో అటుగా వెళుతున్న ఎమ్మెల్యే కాలె యాదయ్య ఘటనా స్థలం వద్ద ఆగి ప్రైవేటు వాహనంలో క్షతగాత్రుడు నగేష్‌ను వికారాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి పంపారు. మార్గమధ్యలో నగేష్ మృతి చెందాడు. శివరాజును మరో వాహనంలో హైదరాబాదులోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. బాధిత కుటుంబాలను వికారాబాద్ ప్రభుత్వాసుపత్రి వద్ద ఎమ్మెల్యే కాలె యాదయ్య పరామర్శించారు. నాగేష్ భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ భరత్ భూషణ్ తెలిపారు.

తూకాల్లో మోసం చేస్తే సహించం

కాంగ్రెస్ కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు చల్లా శ్రీకాంత్‌రెడ్డి


చల్లా శ్రీకాంత్‌రెడ్డి

షాద్‌నగర్: పత్తి తూకాల్లో మోసాలకు పాల్పడుతూ రైతులను అన్యాయం చేస్తే సహించేది లేదని కాంగ్రెస్ కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు చల్లా శ్రీకాంత్ రెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. షాద్‌నగర్ ప్రాంతంలో పత్తి కొనుగోళ్లలో మోసాలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. రైతుల నుంచి పత్తి కొనుగోలు చేస్తున్న జిన్నింగ్, వ్యాపారులపై తూనికలు కొలతల శాఖ అధికారులు ఆకస్మిక దాడులు నిర్వహించాలని డిమాండ్ చేశారు. పత్తి తూకాల్లో మోసాలకు పాల్పడుతున్న వ్యాపారులపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. సరైన గిట్టుబాటు ధర లేకపోవడంతో పత్తి రైతులు నష్టాలకు గురవుతుంటే మిల్లర్లు, వ్యాపారులు తూకాల్లో మోసాలు చేస్తూ రైతుల నుంచి మరింత దోచుకోవడం ఏమిటని ప్రశ్నించారు. గతంలో కూడా పత్తి రైతులకు జరిగిన అన్యాయంపై పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా కనీసం స్పందించ లేదని అన్నారు. రెక్కాడితే కాని డొక్కాడని రైతులు ఎంతో కష్టపడి పంటను పండిస్తే వారికి మద్దతు ధర చెల్లించాల్సింది పోయి వారి నుంచి దోచుకోవడంతో రైతులు నష్టాల పాలవుతున్నారని పేర్కొన్నారు. దీంతో రైతులు వ్యవసాయం చేయాలంటేనే అప్పుల పాలవుతామని భయపడాల్సిన పరిస్థితి నెలకొందని చెప్పారు. రైతుల సంక్షేమానికి పాటు పడుతున్నామని చెబుతున్న ప్రభుత్వాలు రైతులను ఎందుకు ఆదుకోవడం లేదని, రైతులను మోసాలకు గురి చేస్తున్న వారిపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. తూకాల్లో మోసాలు జరగకుండా చర్యలు తీసుకోకుంటే పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని ఆయన హెచ్చరించారు.